సాక్షి
అనకాపల్లి
సోమవారం । 19 । మే । 2025



మోదమ్మ పండగకు సన్నాహాలు

మాడుగల మోదకొండమ్మ పండగకు 8లో సన్నాహాలు చేస్తున్నారు. జూన్ 3న పండగ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉష్ణోగ్రతలు

ఆదివారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	34.3/26.5
చోడవరం	:	37.0/26.0



ముగిసిన శ్రీవిద్య శిక్షణ

సబ్బవరం: దేవీపురంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ నిర్వహించిన శ్రీవిద్య మిడ్‌లెవెల్ కోర్సు ఆదివారంతో ముగిసింది.

న్యూస్‌రీల్

నేడు దేవరాపల్లి వైస్ ఎంపీపీ ఎన్నిక

- ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా మంజులవాణి

దేవరాపల్లి: మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నికను సోమవారం ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి ఎస్.మంజులవాణి ఆధ్వర్యంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు స్థానిక ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి, చేతులు ఎత్తే పద్ధతిలో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించి, వెంటనే ఫలితాన్ని ప్రకటిస్తామన్నారు. గతంలో వైస్ ఎంపీపీ-1గా ఎన్నికైన చింతల బుల్లిలక్ష్మి ఇటీవల నిర్వహించిన మండల పరిషత్ అధ్యక్ష ఉప ఎన్నికలో ఎంపీపీగా గెలుపొందారు. దీంతో వైస్ ఎంపీపీ-1 స్థానం ఖాళీ కావడంతో ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆయన తెలిపారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక బాలాలయంలో అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంత మంది ఆలయం వద్ద కుటుంబ సమేతంగా వంట చేసి, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పలు ప్రజాసంఘాల ప్రతినిధులు భక్తులకు తాగునీరు, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్సవకమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు), ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవి కుమార్ పాలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎరప్రరపు లక్ష్మి పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు సూపర్ లగ్జరీ సర్వీసులు



విశాఖ డిపోలో సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు

మద్దిలపాలెం(విశాఖ): కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు విశాఖ నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మద్దిలపాలెంలో గల విశాఖపట్నం డిపోను తనిఖీ చేశారు. సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ఈనెల బీట్ ది హీట్ థీమ్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. తెలంగాణలో కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు వెళ్లే వారు ముందుగా సీట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. రిజర్వేషన్ కోసం 9958225602, 8309265666, 7382914264 నంబర్లు సంప్రదించాలన్నారు. సాలూరులో జరగనున్న శ్రీ శ్యామలాంబ జాతరకు ఈనెల 22వ తేదీ వరకు విశాఖపట్నం నుంచి సాలూరు, విజయనగరానికి సుమారు 100 బస్సులు నడుపుతున్నామన్నారు.

15 మాంసం దుకాణాలపై కేసులు



శారదానగర్ రహదారిలో మాంసం దుకాణంలో తనిఖీ చేస్తున్న రామచంద్రయ్య

అనకాపల్లి: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాంసం దుకాణాల్లో తూకపు యంత్రాలు (కాటాలు)కు ఏడాదికొకసారి సీలు వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ అనకాపల్లి అసిస్టెంట్ కంట్రోలర్ బి.రామచంద్రయ్య తెలిపారు. పట్టణంతోపాటు మండలంలో పలు మాంసం దుకాణాలను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీలు వేయని కాటాలతో తప్పుడు తూకాలు వేసే వ్యాపారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీళ్లు లేని 15 తూకపు యంత్రాలు స్వాధీనం చేసుకుని, ఆయా దుకాణాలపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో గాజువాక ఇన్‌స్పెక్టరు ఉమా సుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎత్తిపోతలు.. వట్టి మాటలు?

ఏలేరు, తాండవ అనుసంధానాన్ని నిలిపివేసిన కూటమి ప్రభుత్వం

- గత ప్రభుత్వంలో అనుసంధానానికి రూ. 470.5 కోట్లతో టెండర్లు ఖరారు
- నర్సీపట్నంలో శంకుస్థాపన చేసిన వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి
- రైతుల నుంచి వ్యతిరేకత రాకుండా పోలవరం, తాండవ ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చిన స్పీకరు అయ్యన్న
- ఇంతవరకూ ప్రతిపాదన ఊసే లేదు
- రైతుల బాగుకంటే ప్రచారం కోసమే కూటమి పాకులాట !



అనుసంధానానికి నోచుకోని తాండవ ప్రాజెక్టు (ఫైల్)



ఏలేరు తాండవ అనుసంధానానికి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న రాష్ట్ర ఇరిగేషన్ శాఖాధికారులు(ఫైల్)

నాతవరం: ఏలేరు, తాండవ అనుసంధానం పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. తాండవ ఆయకట్టుదారుల నుంచి ప్రభుత్వంపై ఎక్కడ వ్యతిరేకత వస్తుందోనన్న భయంతో ముందస్తుగా పోలవరం కాలువ నుంచి తాండవలోకి ఎత్తిపోతల పథకాన్ని తెస్తానంటూ స్పీకరు సీహెచ్.అయ్యన్నపాత్రుడు కొత్త అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారు. అయితే ఇంతవరకూ ఆ ప్రతిపాదన ఊసే ఎత్త లేదు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఏలేరు కాలువను తాండవ ప్రాజెక్టుకు అనుసంధానం చేసేందుకు రూ. 470.5కోట్లు మంజూరు చేసి, 2022 డిసెంబరులో స్వయంగా నర్సీపట్నంలో శంకుస్థాపన చేశారు.టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేసేందుకు రాష్ట్రస్థాయి ఇరిగేషన్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. అనుసంధానం పనులు సకాలంలోపూర్తి చేస్తే అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాలు.. కాకినాడ జిల్లాలో తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 52వేల ఎకరాలు ఆయకట్టుకు, ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు సైతం పుష్కలంగా సాగు నీరు అందుతుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అదనంగా 5 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది. అనుసంధానం పనులకు సంబంధించి ముందుగా భూ సేకరణ పనులు చేపట్టారు. ఏలేరు కాలువను వెడల్పు చేసేందుకు రెండు జిల్లాల పరిధిలో కాకినాడ జిల్లా పెద్దాపురం ఆర్డీవో, నర్సీపట్నం ఆర్డీవో ఆధ్వర్యంలో సుమారు 28 ఎకరాలు సేకరించారు. రైతులకు నష్టపరిహారం చెల్లింపునకు ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో చెల్లింపులు వాయిదా వేశారు. అనుసంధానం పనులు పూర్తి అయితే జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవలో నిత్యం పుష్కలంగా నీరు ఉంటుంది. వర్షాలతో పని లేకుండా ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో నీరు విడుదల చేయవచ్చు. ఏలేరు, తాండవ అనుసంధానం పనులు పూర్తయితే జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో కూటమి ప్రభుత్వం దానిని రద్దు చేసిందని పలువురు ఆరోపించారు. 20శాతం పనులు పూర్తికాలేదన్న సాకు చూపించి గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు పనులను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. దీనిలో భాగంగా అనుసంధానం పనులు కూడా రద్దు చేసింది. ఏలేరు,తాండవ అనుసంధానం పనులు టెండర్లు దక్కించుకున్న వ్యక్తి టీడీపీకి చెందిన మాజీ ఎంపీ కావడంతో కావాలనే పనులు సకాలంలో చేయకుండా జాప్యం చేసి, వైఎస్సార్‌సీపీకి మంచి పేరు రాకుండా కుట్ర చేశారని పలువురు ఆరోపించారు.


తాండవకు జీవం పోసిన వైఎస్సార్

ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవకు దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి 2006లో జీవం పోశారు. తాండవ కాలువలకు రూ.55 కోట్లు మంజూరు చేసి, సిమెంట్ లైనింగ్ పనులు చేయించారు. తండ్రి ఒకడుగు వేస్తే తనయుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రెండు అడుగులు ముందుకు వేశారు. ఏలేరు, తాండవ ప్రాజెక్టులను అనుసంధానం చేసేందుకు నిధులు మంజూరు చేశారు. తాండవ కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు అంటే నేటికీ వైఎస్సార్ గుర్తుకు వస్తారు. ఏలేరు తాండవ అనుసంధానం పనులు పూర్తి అయితే తండ్రీతనయులిద్దరికీ మంచి పేరు వస్తుందన్న కారణంతో జీర్ణించుకోలేక కూటమి నేతలు పనులు రద్దు చేశారు.

అమలు కానీ స్పీకరు అయ్యన్న హామీ

అమ్మ పెట్టదు అడుక్కోనివ్వదు అన్న చందంగా స్పీకరు అయ్యన్నపాత్రుడు హామీ ఉంది. ఏలేరు, తాండవ అనుసంధానం పనులు కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఆయకట్టుదారులు నుంచి వ్యతిరేకత వస్తుందన్న ముందు జాగ్రత్తతో అయ్యన్న పోలవరం, తాండవ ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చారు. కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో పోలవరం కాలువ నుంచి తాండవలోకి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి, నీటిని తరలిస్తామని నాతవరం మండలం పర్యటనలో స్పీకర్ పదే పదే చెప్పారు. ఈ పథకానికి రూ.2,400 కోట్లు ఖర్చు అవుతుందని ఆయన పలు సభల్లో ప్రకటించారు. అనుసంధానం రద్దు చేసి, ఎత్తిపోతల పథకం హామీచ్చి నెలలు గడుస్తున్నా నేటికి ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. అనుసంధానం పనులు కొనసాగిస్తే ఇప్పటికి చాలా వరకు పనులు జరిగేవని రైతులు అంటున్నారు. తాండవ ఎత్తిపోతల పథకానికి రూ. వేల కోట్లు నిధులు ఏలా ఇస్తారనేదీ ప్రశ్నార్థకమే. స్పీకరు హామీ ఎప్పుడు నేరవేరుతుందో వేచి చూడాలి.

ఈ విషయంపై ఇరిగేషన్ ఈఈ బాలసూర్యం మాట్లాడుతూ పోలవరం తాండవ,ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఇంతవరకు ఎలాంటి ప్రతిపాదనలు లేవన్నారు. తుని సమీపంలో రేఖవానిపాలెం వద్ద పోలవరం కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా తాండవలోకి నీటిని తరలిస్తారన్నారు. పోలవరం కాలువ పనులు ఇంకా కాలేదని తెలిపారు. ఇటీవల తునిలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రితో సమావేశం జరిగింది. ఆసమయంలో తాండవ ప్రాజెక్టుకు సంబంధించిన పనులకు ప్రతిపాదనలు చేశాం. ఎత్తిపోతల పథకం గురించి చర్చలేదన్నారు.



మంచి పేరు వస్తుందని జీర్ణించుకోలేకనే..

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, మా పార్టీకి మంచి పేరు వస్తుందన్న కక్షతో.. జీర్ణించుకోలేక కూటమి ప్రభుత్వం కావాలని ఏలేరు తాండవ ప్రాజెక్టు అనుసంధానం పనులు రద్దు చేసింది. ఆ పనులు సకాలంలో పూర్తి అయితే రెండు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఖరీఫ్ సీజన్‌లో వేలాది ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలమవుతుంది. నాడు తండ్రి దివంగత నేత రాజశేఖరరెడ్డికి కాలువల సిమెంటు లైనింగ్ పనులతో మంచి పేరు వచ్చింది. అనుసంధానం పనులు పూర్తి అయితే తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని ఇలా చేశారు. స్పీకరు అయ్యన్న ఇచ్చిన ఎత్తిపోతల పథకం హామీని వెంటనే నేరవేర్చాలి.

– పెట్ల ఉమా శంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్యే



రైతులు గమనిస్తున్నారు

ఏ ప్రభుత్వంలో ఏం చేశారనేది రైతులు గమనిస్తున్నారు.కూటమి ప్రభుత్వం జిమ్మిక్కులు చేయడం తప్ప రైతులకు చేసింది ఏమీలేదు. తాండవ ప్రాజెక్టు ఆయకట్టుదారులకు అన్ని విధాలుగా మేలు జరిగే అనుసంధానను రద్దు చేయడం వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది, తప్ప లాభం ఏమి ఉండదు. రైతులు సమయం వచ్చినప్పుడు గట్టిగా సమాధానం చెబుతారు.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ నాతవరం మండలం

భళారే... భారీ చేపలు





రైవాడ జలాశయంలో వేటదారుల వలలకు భారీ చేపలు చిక్కుతున్నాయి. ఆదివారం 10 కిలోల బరువున్న రెండు చేపలు చిక్కడంతో వేటదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఆదివారం కావడంతో మత్స్య ప్రియులు పోటీ పడి మరీ వాటిని కొనుగోలు చేశారు. జలాశయంలో ఐదు కిలోల నుంచి 10 కిలోల బరువున్న భారీ చేపలు చిక్కుతున్నాయి. రైవాడ జలాశయంలో లభించే చేపలు రుచిగా ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వస్తుంటారు. దీంతో ఇక్కడి చేపలకు మంచి డిమాండ్ ఉంటుంది. – దేవరాపల్లి

అయ్యవార్లు.. అడ్డదారులు..!

- తప్పుడు సర్టిఫికెట్లతో తిష్ట
- బదిలీ తప్పించుకునేందుకు పుట్టుకొచ్చిన రోగాలు
- మెడికల్ బోర్డు పరిశీలనతో వెలుగులోకి..
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 442 మందిపై నిశిత పరిశీలన
- వీరిలో సగానికి పైగా గత సర్టిఫికెట్ల తిరస్కరణ



డీఈవో కార్యాలయం

విశాఖ విద్య: ఉపాధ్యాయుల బదిలీల కోసం జిల్లా విద్యాశాఖ చేస్తున్న కసరత్తులో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారులను బురిడీ కొట్టించి.. ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన కొంతమంది అయ్యవార్ల బాగోతం బట్టబయలైంది. బదిలీల్లో కోరుకున్న స్థానం పొందేందుకు వైద్యపరమైన కారణాలను చూపిస్తూ.. ఉపాధ్యాయులు సమర్పించిన సర్టిఫికెట్లలో సగానికి పైగా జిల్లా స్థాయి మెడికల్ బోర్డు తిరస్కరించటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సదరు ఉపాధ్యాయులు గతంలో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించారా..? వైద్యుల ధృవీకరణలోనే లోపం జరిగిందా..? అప్పట్లో ఉన్న వ్యాధులు/వైకల్యం ఇప్పుడు సాధారణ స్థితికి వచ్చేశాయా..? అనేది తేలాల్సి ఉంది.

అసలేం జరిగిందంటే..

వైద్యపరమైన ఇబ్బందులు ఉన్న ఉపాధ్యాయులు ప్రిఫరెన్షియల్ కేటగిరి కింద బదిలీ మినహాయింపు కోరుకునే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలాంటి వారు సుమారుగా 1,200 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 56 శాతానికి పైగా వైకల్యం, వ్యాధి తీవ్రత ఉన్నట్లుగా గతంలో మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించిన ఉపాధ్యాయులు.. ప్రస్తుత బదిలీల్లో మినహాయింపు పొందేందుకు.. జిల్లా స్థాయి మెడికల్ బోర్డు ముందు హాజరై.. ధ్రువీకరించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత నెల 24, 25, 26 తేదీల్లో మెడికల్ బోర్డు పరీక్షలు నిర్వహించింది.

సగానికి పైగా తిరస్కరణ

విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 442 మంది ఉపాధ్యాయులు మెడికల్ బోర్డు ముందు హాజరయ్యారు. ఆర్థోపెడిక్‌(ఓహెచ్) సంబంధించి 102 మంది, కంటికి సంబంధించి 68 మంది, క్యాన్సర్‌కి సంబంధించి 43, గుండె సంబంధిత 43 మంది, మిగతా వ్యాధులకు సంబంధించి 186 మంది ఉన్నారు. మెడికల్ సర్టిఫికెట్లను రెండు రోజుల క్రితం కేజీహెచ్ పాలనాధికారులు డీఈవోకు పంపించారు. సర్టిఫికెట్లు పరిశీలనతో ఆసక్తి కరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తమ ముందు హాజరైన ఉపాధ్యాయుల్లో సగానికి పైగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తించదని మెడికల్ బోర్డు ధృవీకరించటం సర్వత్రా చర్చనీయాంశమైంది. అలాగే ప్రిఫరెన్షియల్ కేటగిరిలో 56 శాతానికి పైన ఉన్న 158 మంది ఉపాధ్యాయులు ఎక్కడ దొరికిపోతామోననే బోర్డు ముందు హాజరుకాలేదని తెలుస్తోంది.

సర్టిఫికెట్లు జాప్యం వెనుక మతలబేమిటో..

కేజీహెచ్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఈఎన్‌టీ ఆస్పత్రుల్లో గత నెల 24, 25, 26 తేదీల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. మెడికల్ బోర్డులో సభ్యులైన వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి ఈనెల మొదటి వారంలోనే ధృవీకరించారు. కానీ ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదు చేసేంత వరకు మెడికల్ సర్టిఫికెట్లు డీఈవో కార్యాలయానికి చేరకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది. జాప్యం వెనుక దాగి ఉన్న మర్మమేంటనేది తేలాల్సి ఉంది.

తప్పుడు సర్టిఫికెట్లపై చర్యలు ఉంటాయా..?

ఉపాధ్యాయులు సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు పరిశీలన నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన తప్పిదాల మేరకు, చర్యలు ఎలా ఉంటాయనేది ఉపాధ్యాయ వర్గాల్లో సర్వత్రా చర్చనీయాంశమైంది. 10 మంది వరకు ఉపాధ్యాయులు గతంలో బదిలీ తప్పించుకునేందుకు సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్లు తప్పుడవని తేలినట్లు తెలిసింది. అలాంటి వారిపై శాఖపరంగా చర్యలు ఎలా ఉంటాయి..?. తప్పుడు సర్టిఫికెట్లు జారీ చేసిన వైద్యులను బాధ్యులను చేస్తారా..? అనేది తేలాల్సి ఉంది.

వారి సంగతేంటి?

ప్రిఫరెన్షియల్ కేటగిరిలో 56 శాతంలోపు వైద్యపరమైన ఇబ్బంది ఉన్న వారికి బదిలీల్లో 5 పాయింట్లు ఇవ్వనున్నారు. గతంలో వీరు సమర్పించిన సర్టిఫికెట్లపై పరిశీలన లేదు. అయితే 56 శాతానికి పైగా వైకల్యం, వ్యాధి తీవ్రత ఉన్న వారిలోనే సగానికి పైగా ప్రిఫరెన్షియల్ కేటగిరి కిందకు రారని మెడికల్ బోర్డు పరిశీలనలో తేలింది. 56 శాతంలోపు ఉన్న సుమారు 600 మంది మెడికల్ సర్టిఫికెట్లలో వాస్తవికత ఎంతనేది పరిశీలన చేయాలని ఉపాధ్యాయులు అంటున్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

జిల్లాలో 19 కేంద్రాలు ఏర్పాటు



పదో తరగతి పరీక్షలు జరిగే గాంధీనగరం ప్రభుత్వ పాఠశాల

అనకాపల్లి టౌన్: జిల్లాలో 19 కేంద్రాల్లో సోమవారం నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు జిల్లాలో 20,774 మంది విద్యార్థులు హాజరుకాగా, 18,293 మంది ఉత్తీర్ణులయ్యారు. 2,481 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో తప్పారు. వీరితో పాటు ప్రైవేట్‌గా 1,268 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యం (ఓపెన్ స్కూల్) లో విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు 422 మంది టెన్త్ విద్యార్థులు, 980 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులు హాజరుకానున్నారు. యలమంచిలి, చోడవరం, అనకాపల్లి నియోజకవర్గాల్లో పదవ తరగతికి మూడు, ఇంటర్మీడియెట్‌కి మూడు చొప్పున సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో గిడ్డి అప్పారావు తెలిపారు. ఆయా కేంద్రాలకు 38 మంది అధికారులను నియమించినట్టు చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీరు, ఇతర సదుపాయాలు కల్పించినట్టు డీఈవో తెలిపారు.

నో మోర్ బోరింగ్.. వచ్చేస్తోంది గేమ్స్ జోన్

- ఎయిర్‌పోర్టులో గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్
- టెండర్లు ఆహ్వానించిన ఎయిర్‌పోర్ట్
- ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక



గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్ నమూనా

సాక్షి, విశాఖపట్నం: దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకల్లో వృద్ధి నమోదవుతుండటంతో విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో సరికొత్త సౌకర్యాలు కల్పించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రణాళికలు అమలు చేస్తోంది. ఇప్పటికే దేశంలోని ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఏఏఐ.. విశాఖలోనూ ఈ తరహా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. బోర్డింగ్ కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులకు బోర్ కొట్టకుండా.. పిల్లలతో కలిసి కాసేపు ఆనందంగా గడిపేలా ఈ గేమ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

గత ఏడాది వరకు డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సర్వీసులతో కళకళలాడిన విశాఖ విమానాశ్రయం .. ప్రయాణికుల రాకపోకల్లో గణనీయ వృద్ధి సాధించింది. దీంతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమైంది. అయితే, గత ఆరు నెలలుగా సర్వీసుల రద్దు, కొత్త సర్వీసులు అర్ధాంతరంగా నిలిచిపోవడం వంటి వాటితో ఎయిర్‌పోర్టు ఒడిదొడుకులు ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం, ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎయిర్‌పోర్టు వెనుకబడింది. అయితే ఎయిర్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తీవ్రంగా కృషి చేస్తూ.. ఎయిర్‌లైన్స్ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. వైజాగ్ ఎయిర్‌పోర్టును తిరిగి పుంజుకునేలా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏఏఐ కూడా మద్దతుగా నిలుస్తోంది. ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే విశాఖ ఎయిర్‌పోర్టులో గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు టెండర్లు ఆహ్వానించింది.

మొదటి అంతస్తులో ఏర్పాటు

ఎయిర్‌పోర్టు మొదటి అంతస్తులో డొమెస్టిక్ షా (సెక్యూరిటీ హోల్డ్ ఏరియా) ప్రాంతంలోని 14 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ గేమ్ సెంటర్ రాబోతోంది. డొమెస్టిక్, ఇంటర్నేషనల్ టెర్మినల్స్‌ను అనుసంధానించేలా సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు టెండర్లలో స్పష్టం చేశారు. పిల్లలు ఆడుకునేందుకు చిన్న చిన్న జాయ్‌రైడ్స్, వీడియో గేమ్స్, పెద్దలు, యువత కాసేపు ఎంజాయ్ చేసేలా ప్లే స్టేషన్, రిలాక్సింగ్ సెంటర్ అందుబాటులోకి రానున్నాయి. విమానాశ్రయ మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విమానాశ్రయ కార్యకలాపాలు, ఎయిర్ నావిగేషన్ సేవల నిర్వహణ, నియంత్రణపైనే కాకుండా.. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఏఏఐ ఈ ప్రాజెక్టుపై దృష్టి సారించింది. టెండర్లు ఖరారు చేసిన ఏడాదిలోపు గేమ్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫెసిలిటీ సెంటర్ అందుబాటులోకి వస్తుందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న జిల్లా అధికారి బాలాజీ, తదితరులు

అనకాపల్లి: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి ఎం.బాలాజీ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దీప స్మృత్యాంజలి దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మే నెల మూడో ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారన్నారు. ఎయిడ్స్ రోగులకు ఆస్పత్రి ఆవరణలో ఉచితంగా ప్రభుత్వం మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 7,858 మంది ఎయిడ్స్ రోగులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏఆర్టీ సీనియర్ మెడికల్ అధికారి ప్రియదర్శిని, దిశ సీఎస్‌వో స్పందన తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

రోలుగుంట: మండలంలో పడాలపాలెం గ్రామానికి చెందిన మరిశా రజని(17) రెండు రోజుల క్రితం అదృశ్యమైంది. బంధువుల ఇళ్ల వద్ద, గ్రామంలో పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తండ్రి రాంబాబు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

ఉగ్రవాదం నశించాలి



గాంధీ విగ్రహం వద్ద సంఘీభావం తెలుపుతున్న కళాకారులు

బీచ్‌రోడ్డు: 'ఆపరేషన్ సిందూర్'పేరిట జరుగుతున్న సైనిక పోరాటానికి మద్దతు తెలియజేస్తూ విశాఖ కళాకారులు సంఘీభావం ప్రకటించారు. జీవీఎంసీ ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహంకు పెద్ద సంఖ్యలో కళాకారులు తరలివచ్చి.. భరతమాతకు జై, వందేమాతరం, టెర్రరిజం నశించాలి, సైనికులకు సలాం సలాం అంటూ నినాదాలు చేశారు. కళా సంఘాల ప్రతినిధులు యాక్మీ ప్రతాప్, సన్ మూర్తి, భయ్యా శ్రీనివాస్, బొడ్డేటి జగ్రావు, చెన్న తిరుమలరావు, నాంచారయ్య, మను పల్లా తదితరులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని.. గాంధీ విగ్రహానికి ముందుగా పూలమాల వేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ పండగకు సన్నాహాలు

- 3న మాడుగులలో అమ్మవారి ఉత్సవం
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు
- సతకంపట్టు వద్ద కొలువుదీరిన అమ్మవారు
- నిత్య పూజలు, దర్శనాలతో సందడి

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, భక్తుల కొంగు బంగారంగా భాసిల్లుతున్న మాడుగుల మోదకొండమ్మ పండగకు సన్నాహాలు చేస్తున్నారు. స్థానిక కోట ప్రాంగణంలో సతకంపట్టు వద్ద కొలువుదీరిన అమ్మవారు ఈ నెల 8వ తేదీ నుంచి ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. ఇక్కడ ప్రత్యేక అలంకరణలో నెల రోజులపాటు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు జూన్ 3వ తేదీన పండగ నిర్వహించడానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మహరాజులు కాలం నుంచి ఏటా నెల రోజులు పండగ అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ పండగకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి భక్తులు వస్తుంటారు.

ఆలయం దినదినాభివృద్ధి..

భక్తులు, దాతలు, గ్రామస్తులు సహకారంతో మోదకొండమ్మ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. సామాన్య, మధ్య తరగతి వారు తక్కువ ఖర్చుతో వివాహాలు నిర్వహించడానికి ఇక్కడ రెండు కల్యాణ మండపాలు నిర్మించారు. భక్తులు సలువుగా అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఉచితంగా సురక్షిత తాగునీరు, ప్రసాదం అందజేస్తున్నారు. ఈ ఏడాది రూ.40 లక్షలతో అమ్మవారికి వెండి కవచం, తదితర ఆభరణాలు అలంకరించారు.



నగలు, పూలతో మోదకొండమ్మకు అలంకరణ


ఆలయ చరిత్ర..

ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మకు ఘనమైన చరిత్ర ఉంది. అందమైన చెట్లు, పర్వతాలు, చెరువులతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారు వెలిశారు. ఒక నాడు పూరిపాకలో వెలసిన అమ్మవారికి 50 ఏళ్ల క్రితం మాడుగుల తహసీల్దార్ హంపన్న ఆలయాన్ని నిర్మించారు. ప్రత్యేక రాతి విగ్రహం ఏర్పాటు చేసి అమ్మవారిని వెలుగులోకి తీసుకువచ్చారని ప్రతీతి. ఆ తర్వాత కొంతమందిని కమిటీగా ఏర్పాటు చేసి ఆయన బదిలీపై వెళ్లిపోయారు. అదే కమిటీ ఈ నాటికి అమ్మవారి పండగను అలనాటి రాజుల వైభవంతో నిర్వహిస్తూ వస్తోంది. మైదానం నుంచి పాడేరు, అరకు, అనంతగిరి పర్వత ప్రాంతాలకు వెళ్లి సురక్షితంగా వాహనాలు తిరిగి వస్తున్నాయంటే, అది అమ్మవారి కృపగా చెప్పుకుంటున్నారు. పాడేరు మోదకొండమ్మ మాదిరిగానే మాడుగుల మోదమ్మకు నిత్య ధూప, దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.



అమ్మవారు రాతి విగ్రహానికి పూజ చేస్తున్న మాడుగుల మహారాణి మాయంక్ కుమారి దేవ్ (ఫైల్)

ఆలయాభివృద్ధే జీవిత ఆశయం



మహరాజులు పాలన అంతరించిపోయినా అప్పటి సంప్రదాయాలతోనే పండగ నిర్వహిస్తున్నాం. పండగ సందర్భంగా ఈ నాటికి రాజవంశీకులు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది లక్ష మందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నాం. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నాం. పండగ విజయవంతానికి గ్రామస్తులతోపాటు అన్ని శాఖల అధికారులు, పోలీసులు, భక్తులు సహకరించాలి. ఆలయాభివృద్ధే నా జీవిత ఆశయం.

– పుప్పాల అప్పలరాజు, ఆలయ కమిటీ చైర్మన్, మాడుగుల

దేశ పాలన, సంక్షేమం అమలులో యూపీఎస్సీ కీలకం

- పోటీ పరీక్షల్లో ప్రణాళికతో గెలుపు తథ్యం
- కేంద్ర అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు రాజుగోపాల్



సమావేశానికి హాజరైన నిరుద్యోగులు



సమావేశంలో మాట్లాడుతున్న రాజుగోపాల్

అనకాపల్లి: దేశాభివృద్ధి, పాలన, సంక్షేమ పథకాల అమలు, మార్పులకు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కీలకమని కేంద్ర ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది బి.ఎస్.వి.రాజుగోపాల్ తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవం సందర్భంగా వైజాగ్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో సివిల్స్, గ్రూపు–1లపై శనివారం రాత్రి నిరుద్యోగులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలన్న సంకల్పం సివిల్స్, గ్రూప్–1 పరీక్షల్లో విజయం సాధించడం ద్వారా సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. లాజికల్ థింకింగ్, ప్రాబబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ మొదలగు అంశాలపై పోటీ పరీక్షల ఔత్సాహికులు నైపుణ్యం సాధించాలన్నారు. శీఘ్ర గణనా పద్ధతులు (షార్ట్‌కట్స్), ట్రిక్స్ నేర్చుకోవడం ద్వారా పరీక్షల్లో సమయం ఆదా చేయవచ్చన్నారు. నిత్య అధ్యయనం, మాక్ టెస్టులు, సమయ పాలన విజయానికి కీలమన్నారు. పరీక్షల వల్ల అనలిటికల్ మైండ్‌ను మెరుగుపరచుకోవచ్చని, వైఫల్యాలు సహజమని, తట్టుకుని పట్టుదలతో ప్రయత్నిస్తే గెలుపు తమదేనన్నారు. సివిల్స్–2025 విజేత డాక్టర్ రావాడ సాయి మోహిని మానస మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు దేశంలో మార్పును తీసుకురాగల శక్తి ఉందన్నారు. సరైన ప్రణాళిక, పట్టుదల, సాధనతో సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలి, శిక్షణ ఎలా పొందాలి, సమయ పాలన, ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం ఎలా తదితర అంశాల గురించి ఆమె విద్యార్థులకు వివరించారు. వైజాగ్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్ పోతల మాట్లాడుతూ స్టడీ గ్రూప్స్‌లో చేరడం వల్ల విద్యార్థుల ఆలోచనల మార్పిడి జరుగుతుందన్నారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు సుదీర్ఘకాల అధ్యయనం, సహనం, నిరంతర కృషి ఎంతో అవసరమన్నారు. బోధకురాలు పి.గాయత్రి మాట్లాడుతూ పోటీ పరీక్షలు నైపుణ్యాలను మెరుగుపరుస్తాయన్నారు. విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, నెస్ట్ మే పవర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో పి.రమేష్‌బాబు, సదస్సు సమన్వయకర్తలు మళ్ల బాపునాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, గ్రంథాలయ ప్రతినిధులు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు 'సూపర్ సిక్స్' దగా

- 'ఆడబిడ్డ నిధి'కి మంగళం
- లిక్కర్ స్కామ్ పేరుతో కూటమి ప్రభుత్వం కుట్ర
- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త ధర్మశ్రీ ధ్వజం



అనకాపల్లి: సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలకు మంగళం పాడేశారని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి 'ఆత్మ స్తుతి, పర నింద'అన్న చందంగా, ఎక్కడ ఏం జరిగినా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే బాధ్యత అంటూ దుష్ప్రచారం.. యథేచ్ఛగా హామీల ఉల్లంఘన.. ప్రతిసారీ డైవర్షన్ పాలిటిక్స్.. ఇలా ఏడాది పాలన సాగిందన్నారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలన్నింటికి మంగళం పాడిన చంద్రబాబు.. నిస్సిగ్గుగా దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చివరకు పిల్లలను కూడా వదిలిపెట్టకుండా అందరినీ మోసం చేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. బడికి వెళ్తే నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు అంటూ పిల్లలకు.. ఇంట్లో అమ్మ కనిపిస్తే నీకు నెలకు రూ.1500 అంటూ తల్లులను.. నిరుద్యోగ యువత కనిపిస్తే నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పి ఏడాది అవుతున్నా నేటికీ హామీలు అమలు చేయలేదన్నారు. మరోవైపు ఏడాదిలోనే ఏకంగా రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడం దారుణమన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి నెలకు రూ.1500 చొప్పున ఏటా రూ.18 వేలు ఇస్తామన్న హామీ అటకెక్కిందన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డ నిధికి అర్హులైన 1.80 కోట్ల మంది మహిళలను నమ్మించిన చంద్రబాబు దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే ఏటా రూ.32,400 కోట్ల నిధులు అవసరమవుతాయన్నారు. గతేడాది ఆడబిడ్డ నిధికి ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదని ఆయన స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరికం ఉంటే, అప్పుడు పీ–4 కార్యక్రమంతో 'ఆడబిడ్డ నిధి'ని అనుసంధానిస్తామని ఈ నెల 17న కర్నూలు వేదికగా ప్రకటించడం సిగ్గుచేటన్నారు.

లిక్కర్ స్కామ్ ఓ సృష్టి

అసలు జరగని లిక్కర్ స్కామ్ జరిగినట్లు చెబుతూ, తమ అనుకూల మీడియాలో పిచ్చి కథనాలు రాయిస్తూ, ఆయా ఛానళ్లలో అదే పనిగా చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తూ వైఎస్సార్‌సీపీపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతుందని ధర్మశ్రీ ఆరోపించరాఉ. తప్పుడు వాంగ్మూలాలు, అక్రమ అరెస్టులు, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నిస్సిగ్గుగా అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు 2014–19 మధ్య చేసిన లిక్కర్ స్కాం బయటకు రాకూడదన్న ఉద్దేశంతో ఎదుటి వారిపై బురద చల్లుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుసరించిన మద్యం విధానం వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం ఎక్కడ వాటిల్లిందో ఇప్పటి వరకు ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారన్నారు. తొలి నుంచి ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్న వ్యక్తులను ఇరికించాలనే కుట్రతోనే లిక్కర్ స్కామ్ పేరుతో కూటమి ప్రభుత్వం కేసులు పెడుతోందని ఆయన స్పష్టం చేశారు.

ఇసుక తోలకం అభివృద్ధి నిధులు భద్రం

బుచ్చెయ్యపేట : వడ్డాదిలో ఇసుక తోలకాల వల్ల గ్రామాభివృద్ధి కోసం సేకరించిన రూ, 15 లక్షలు నగదు భద్రంగానే ఉన్నాయని గ్రామ పెద్దలు అడపా నరిసింహమూర్తి తెలిపారు. ఆదివారం తన ఇంటి వద్ద జరిగిన విలే కర్ల సమావేశంలో ఆయన గతంలో గ్రామస్తులంతా కలిసి తన వద్ద ఉంచమన్న రూ. పదిహేను లక్షల గ్రామ నగదును చూపించారు. గతంలో గ్రామదేవత మోదకొండమ్మ పండగలో మిగిలిన డబ్బులు గ్రామ నాయకులు దొండా సన్యాసిరావు,బత్తుల తాతయ్యబాబు,ఎస్.సత్యనారాయణ ముగ్గురి పేరు మీద డిపాజిట్ చేసిన మొత్తం సుమారు రూ.ఆరేడు లక్షలున్నాయన్నారు. అలాగే కాపు సంఘం అభివృద్ధికి సేకరించిన డబ్బులను సన్యాసిరావు, చక్రధర్ పేరు మీద బ్యాంకులో డిపాజిట్ చేశారన్నారు. నాలాగే వారి వద్ద ఉన్న డబ్బులు తెస్తే అఖిలపక్ష నాయకులంతా కలిసి గ్రామంలో ఉన్న దేవాలయాలను అభివృద్ధి చేద్దామని అన్నారు. తాను 60 ఏళ్లగా ఆర్ఎస్ఎస్ నాయకుడిగా ఉంటూనే దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి వడ్డాది గ్రామ అభివృద్ధికి పాటు పడుతున్నానన్నారు. వడ్డాది జంక్షన్, సంతబయిలు వద్ద తన తాత,తండ్రులు కూడా ఉచితంగా బస్‌షెల్టర్‌లు, దేవాలయాలకు స్థలాలు అందించామన్నారు. తాము కట్టిన బంగ్లాను కొంతమంది ఆక్రమించి వ్యాపారాలు చేయగా గ్రామదేవత మోదకొండమ్మ ఆలయ హుండీలను ఎవరికీ తెలియకుండా తెరిచి అమ్మవారి ఆదాయాన్ని, ఆభరణాల లెక్కలు చెప్పడం లేదన్నారు. తన వద్ద ఉంచిన ఇసుక డబ్బుల్లో ఒక్క రూపాయి కూడా వాడలేదని, కానీ సినీ నిర్మాత నట్టికుమార్‌కు తప్పుడు సమాచారం అందించి ఆయన చేత డబ్బులు అవినీతి జరిగినట్టు మాట్లాడించడం తగదన్నారు. గ్రామ పెద్దలంతా కలిసి వస్తే తన దగ్గర ఉన్న రూ.పదిహేను లక్షలతో పాటు మోదకొండమ్మ గుడి డబ్బులు, కాపు సంఘం నిధులన్నీ తెస్తే గ్రామాభివృద్ధి చేద్దామన్నారు. సమావేశంలో సయ్యపురెడ్డి సత్యనారాయణ, అడపా రామక్రిష్ణ పాల్గొన్నారు.



ఇసుక తోలకం ద్వారా వచ్చిన రూ. 15 లక్షలు చూపుతున్న అడపా

ఏక తాటిపైకి కబడ్డీ సంఘాలు రావాలి

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రలో రెండు కబడ్డీ సంఘాలు ఉండటంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారని... అందరూ ఒకేతాటి పైకి రావాలని ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. రాష్ట్ర కబడ్డీ సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ తనపై ఎలాంటి ఒత్తిడి లేదని, క్రీడాకారులు ఇబ్బంది పడకూడదన్నారు. హైకోర్టులో రిట్ పిటిషన్ అనంతరమే పూర్తి సమాచారం తనకు తెలిసిందన్నారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రతినిధి, ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ కార్యదర్శిగా వ్యవహరించిన శ్రీకాంత్‌పై విచారణ జరిపిస్తామన్నారు. వెంకటరెడ్డిని తప్పుదారి పట్టించి కబడ్డీ సంఘం ఏర్పాటు చేయడమే గాక నేర కార్యకలాపాలకు పాల్పడిన శ్రీకాంత్‌పై రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థకు ఫిర్యాదు చేస్తామన్నారు. క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒకే సంఘంగా ముందుకు తీసుకువెళ్లడానికి కృషి చేస్తామన్నారు.

షిప్‌యార్డు అధికారి భానుప్రియకు అరుదైన గుర్తింపు



భానుప్రియను సత్కరిస్తున్న కేంద్రమంత్రి శర్బానంద సోనోవాల్

సాక్షి, విశాఖపట్నం: మారీటైమ్ డిజైన్, ఇన్నోవేషన్‌లో అద్భుతంగా రాణిస్తున్న హిందూస్థాన్ షిప్‌యార్డ్ డిజైన్ అండ్ బీడీడీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.భానుప్రియకు అరుదైన గుర్తింపు లభించింది. ముంబైలోని శాంటాక్రూజ్‌లో అంతర్జాతీయ మారీటైమ్ వుమెన్స్‌డే ఆదివారం నిర్వహించారు. గ్రీన్ షిప్ బిల్డింగ్ టెక్నాలజీ అభివృద్ధి, హైడ్రోజన్ పవర్డ్ టగ్స్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన భానుప్రియకు ప్రత్యేక ఆహ్వానం అందింది. మారీటైమ్ ఇండస్ట్రీ భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలిచారంటూ భానుప్రియని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్, షిప్పింగ్ డీజీ సాగర్ మెయిన్ సమ్మాస్ చేతుల మీదుగా సత్కంచారు. భానుప్రియకు అరుదైన గుర్తింపు లభించడంపై హెచ్ఎస్ఎల్ సీఎండీ కమొడర్ హేమంత్ ఖత్రి అభినందనలు తెలిపారు.

సింహాద్రి ఎన్టీపీసీకి ప్రతిష్టాత్మక అవార్డులు

పరవాడ: కేరళలోని త్రివేండ్రంలో ఐసీటీఈపీ కౌన్సిల్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'తుస్కర్ అవార్డు–25'లో సింహాద్రి ఎన్టీపీసీకి పలు బంగారు, వెండి అవార్డులు లభించాయి. కమ్యూనిటీ అభివృద్ధి, ప్రభావవంతమైన ప్రజా నిబద్ధత పట్ల ప్రాజెక్టు అవలంబిస్తున్న విధానానికి ఈ అవార్డులు దక్కాయి. సింహాద్రి ఎన్టీపీసీక ఓఓహెచ్ విభాగంలో 'గోల్డ్ ఇన్ ఎక్స్‌లెన్స్'అవార్డు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) విభాగంలో 'సిల్వర్ ఫర్ ఎక్స్‌లెన్స్'అవార్డులు లభించాయి. అవార్డుల ప్రదాన కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ శశి థరూర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి సిహెచ్ కురియన్, కేరళ ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి జి.ఆర్.అనిల్, సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తుస్కర్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, అధికారులు


జాతీయ స్థాయి పోటీలకు 'విశాఖ లోకోమోటివ్' సిద్ధం



లోకోను ట్రయల్‌రన్ కోసం జెండా ఊపి ప్రారంభించిన డీఆర్ఎం

తాటిచెట్లపాలెం: త్వరలో బనారస్‌లోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్‌లో జరగనున్న ఆలిండియా ఎలక్ట్రిక్ లోకో క్యాబ్ పోటీల్లో విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకోషెడ్ నుంచి ఆధునికీకరించిన లోకో మోటివ్ పాల్గొననుంది. ఈ పోటీల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన డబ్ల్యుఏపీ7 లోకోమోటివ్ విజయవంతంగా తన ట్రయల్ రన్‌ను పూర్తి చేసుకుంది. వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఈ ట్రయల్ రన్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన లోకోషెడ్ సిబ్బంది కృషిని అభినందించి నగదు బహుమతిని ప్రకటించారు. ఈ పోటీల్లో ఆధునిక సదుపాయాలు కలిగిన లోకోమోటివ్ విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ బి.షణ్ముఖరావు ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎలక్ట్రికల్ లోకో షెడ్ సిబ్బంది ఈ డబ్ల్యుఏపీ7 37419 ఎలక్ట్రిక్ లోకోను 'లోకో పైలట్ ఫ్రెండ్లీ'గా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా అనేక కీలక మార్పులు చేపట్టారు. క్రూ డెస్క్ అభివృద్ధి, క్యాబ్‌లో ఎయిర్ కండిషనింగ్ డక్టింగ్, విశాలవంతమైన, సౌకర్యవంతమైన సీటింగ్, మోటార్ ఆపరేటెడ్ సైడ్ విండో షట్టర్స్, రేర్ వ్యూ మిర్రర్ కెమెరా, రేడియం స్టిక్కరింగ్‌తో కూడిన ఫ్లోరింగ్, డ్రైవర్ టూల్ బాక్స్, సర్దుబాటు చేయగల క్యాబ్ స్పాట్ లైట్ తదితర నూతన హంగులు సమకూర్చారు. ఈ లోకో మోటివ్ జాతీయ స్థాయి పోటీల్లో విశాఖపట్నం కీర్తిని ఇనుమడింపజేస్తుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేశారు.

ఐస్‌బాల్ హాకీ ఓవరాల్ చాంప్ తెలంగాణ



తెలంగాణ ఆటగాళ్లతో బాండీ జాతీయ కార్యదర్శి లవ్‌కుమార్ జాదవ్

పెందుర్తి: రాష్ట్ర బాండీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 7వ జాతీయ ఫెడరేషన్ బాండీ(ఐస్‌బాల్ స్కేటింగ్ హాకీ) ఫెడరేషన్ కప్ టోర్నమెంట్‌లో తెలంగాణ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. సుజాతనగర్ సీ2 జోన్ పార్కులోని సింథటిక్ ఐస్ స్కేటింగ్ రింక్‌లో ఆదివారం ఫైనల్స్ జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హర్యానా, ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

దేశంలో 15 శాతం గర్భిణుల్లో ఎక్లామ్సియా



డాక్టర్ కారుమంచి అనంత్‌కి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ రాజు, చైర్‌పర్సన్ డాక్టర్ రాధ

మహారాణిపేట: రుషికొండలోని రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్ట్రెట్రిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(ఫోగ్సీ) ప్రతిష్టాత్మక ప్రెసిడెన్షియల్ కాన్ఫరెన్స్ 'వేవ్స్ 2025'ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు వెయ్యి మంది గైనకాలజిస్టులు పాల్గొని.. ప్రసూతి, స్త్రీల ఆరోగ్యంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా 100కు పైగా పరిశోధన పత్రాలు, పోస్టర్లను సమర్పించారు. ముగింపు కార్యక్రమంలో ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణుడు డాక్టర్ అనంత్ కారుమంచి మాట్లాడారు. ప్రసూతి శాస్త్రం స్త్రీ పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన కీలక విభాగమన్నారు. గర్భధారణ సమయంలో మహిళలు తప్పనిసరిగా అనేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మన దేశంలో సుమారు 15 శాతం మంది గర్భిణులు ఎక్లామ్సియా వ్యాధి బారిన పడుతున్నారని, దీని కారణంగా మెటర్నల్, చైల్డ్ మోర్టాలిటీ రేట్లు కూడా ఎక్కువగా ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధి సోకడానికి ముందే పసిగట్టే కచ్చితమైన విధానాలు మన దేశంలో ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. అయితే వ్యాధి వచ్చే అవకాశాన్ని ముందుగానే గుర్తించడానికి వీలైన ఒక టెస్ట్ ప్రస్తుతం అమెరికా, యూరప్‌లలో ప్రాచుర్యం పొందిందన్నారు. ఎక్లామ్సియా ముందస్తు నిర్ధారణపై పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను చేసిన డాక్టర్ అనంత్ కారుమంచిని సదస్సులో పాల్గొన్న పలువురు వైద్యులు అభినందించారు. ఫోగ్సీ అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తాండల్వాడ్కర్, సౌత్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పల్లనియప్పన్, మాజీ డీఎంఈ డాక్టర్ ఆర్.శశి ప్రభ, గైనక్ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సిహెచ్ పద్మావతి నాయుడు, వైద్యులు పాల్గొన్నారు.

'రెడ్ బుక్'లో తెలుగుతల్లి పేరు రాశారేమో?

- భాషోద్యమకారుల ఎద్దేవా
- తెలుగు మనుగడకే ప్రశ్నార్థకంగా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు
- మద్దిలపాలెంలో అర్ధనగ్న ప్రదర్శన



మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద అర్ధనగ్న నిరసన

మద్దిలపాలెం: రాష్ట్ర విద్యాశాఖామంత్రి లోకేశ్ తన రెడ్ బుక్‌లో తెలుగుతల్లి పేరు రాసుకున్నారేమో అని తెలుగు భాషోద్యమకారులు ఎద్దేవా చేశారు. తెలుగు భాషా పరిరక్షణ కోసం ఆదివారం మద్దిలపాలెం కూడలిలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన జరిగింది. తెలుగుదేశం పార్టీ పేరులో 'తెలుగు'ఉన్నప్పటికీ.. వారి నిర్ణయాలు తెలుగకు వ్యతిరేకంగా ఉన్నాయని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు తెలుగు భాష మనుగడ లేకుండా చేసేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన తొమ్మిది అంచెల విద్యా విధానం తెలుగు భాష మనుగడను ప్రశ్నార్థకం చేయడమే కాకుండా చిన్నారుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం ద్వారా తెలుగు భాష ప్రాముఖ్యత తగ్గిపోయి క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. నిరసనలో ఆచార్య ప్రసాద్, కె.వి.ఎస్.మూర్తి, చిన్న సూర్యనారాయణ, ఎర్రం నాయుడు, శ్రీనివాస్, శ్రీధర్, ఆచార్య సూరప్పడు, మోహన్ తదితరులు పాల్గొని తెలుగుతల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు భాషను రక్షించాలని నినాదాలు చేశారు.

ఆలోచింపజేసిన నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత

మద్దిలపాలెం: సమాజంలో అత్యధిక హత్యలు వివాహేతర సంబంధాల వల్ల జరుగుతున్నాయని ఓ సర్వే ఆధారంగా రచించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత' నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. తెలుగు కళా సమితి స్వర్ణోత్సవ వేడుక ప్రదర్శనలో భాగంగా ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఈ నాటికను సమితి కార్యదర్శి, కార్యక్రమ నిర్వాహకులు వై.ఎస్.కె.ఎన్.స్వామి నేతృత్వంలో ప్రదర్శించారు. 2022లో జాతీయ రచన పోటీల్లో ద్వితీయ రచన బహుమతి గెలుపొందిన ఈ నాటికను రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రదర్శించగా.. ఉత్తమ బహుమతులను చేజిక్కించుకుంది. కార్యక్రమంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సాహితీవేత్త ఆచార్య అప్పాజ్యోసుల సత్యనారాయణ, తెలుగు కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జి.త్రిమూర్తులు, సెంట్రల్ యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి, కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ

అనకాపల్లి టౌన్: ట్రాఫిక్ రూల్స్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ సూచించారు. పట్టణంలోని కొబ్బరితోట జంక్షన్ వద్ద ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులతో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో ప్రయాణికులను ముందు కూర్చోబెట్టే విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువు, ఆరోగ్యం ముఖ్యం



మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి జగన్నాథం

కశింకోట: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం కోరారు. తాళ్లపాలెం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం ఆయన ఆరోగ్యం, మంచి అలవాట్ల గురించి వివరించారు. రోజూ అర్ధగంట మించి నడక సాగించాలన్నారు. రోజూ ఎక్కువ నీరు తాగాలన్నారు. ఒత్తిళ్లకు దూరంగా ఉండాలని, ఆధ్యాత్మికతపై దృష్టి సారించి మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలన్నారు. రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలన్నారు. దీనివల్ల విజ్ఞానం పెంపొందుతుందన్నారు.

నార సంచుల పంపిణీ



నార సంచులు పంపిణీ చేస్తున్న జేడీ గ్రూపు సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జేడీ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం నార సంచులు పంపిణీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా సీబీఐ మాజీ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ పిలుపు మేరకు ఈ సంచులను పంపిణీ చేసినట్లు జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కారుమూడి అను తెలిపారు. ఈ కార్యక్రమంలో జేడీ గ్రూప్ సభ్యులు నుదురుపాటి తాతాజీ తెలిపారు.

కౌలురైతుల గుర్తింపులో జాప్యం తగదు

అనకాపల్లి టౌన్: కౌలురైతుల గుర్తింపు చట్టం తక్షణమే అమలు చేయాలని గ్రామ రైతు స్వరాజ వేదిక రాష్ట్ర కో-కన్వీనర్ బాలు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు మొదలవుతున్న సమయంలో గ్రామాల్లో కౌలు రైతులతో ఎటువంటి సమావేశాలు అధికారులు నిర్వహించడం లేదన్నారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే గత ప్రభుత్వం తీసుకువచ్చిన కౌలురైతుల గుర్తింపు చట్టాన్ని రద్దు చేస్తున్నామని ప్రకటించారే తప్పా, నేటి వరకు కొత్త చట్టం తీసుకురావడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతుల గుర్తింపు కోసం అత్యవసరంగా చర్యలు చేపట్టాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

లెవెన్	:రాజా
అర్జున్ సన్ఆఫ్ వైజయంతి	:సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ	: సత్యనారాయణ స్క్రీన్-2
హిట్-3	:పర్తిసాయి
సింగల్	:షిర్డీసాయి
మన కుటుంబం	:వెంకటేశ్వర
అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి	:శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్	:రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 394 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 329 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నెంబర్ సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 16 యూనిట్లు, బీ పాజిటివ్ -10, ఓ పాజిటివ్ -14, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్‌ను 9703619706 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

మొరాయిస్తున్న సర్వర్

- కొత్త రేషన్ కార్డుల నమోదులో జాప్యం
- దరఖాస్తుదారుల ఇబ్బందులు
- ఇతర పనులు చేయడం లేదని ఆవేదన



కశింకోట సచివాలయంలో కొత్త బియ్యం కార్డుల కోసం దరఖాస్తు చేయడానికి నిరీక్షిస్తున్న ప్రజలు

కశింకోట: కొత్త బియ్యం కార్డులు కోసం దరఖాస్తు నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు. సర్వర్లు తరచూ మొరాయిస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో తీవ్ర జాప్యం తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం తాజాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మండలంలో 20 గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తులను తీసుకుంటున్నారు. అక్కడి డిజిటల్ అసిస్టెంట్లు దరఖాస్తులు స్వీకరించి వాటిలో వివరాలు సరిగ్గా ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని పరిశీలించి డేటా నమోదు చేస్తున్నారు. లేని వివరాల కోసం ఆరా తీస్తున్నారు. బియ్యం కార్డు పొందడానికి దరఖాస్తు చేయడానికి అనుసరించాల్సిన నిబంధనలను వల్లె వేస్తున్నారు. దీంతో దరఖాస్తుల స్వీకరణ. నమోదు ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతోంది. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. భూముల వివరాలకు సంబంధించి వన్‌బీ పత్రాలు, ఇతర పత్రాలు కూడా ఇస్తుండటంతో మరింతగా నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతోపాటు సర్వర్ పని చేయకపోవడంతో డేటా నమోదుకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో ఇబ్బంది తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రతి చోట దాదాపు ఇదే పరిస్థితి నెలకొని ఉందని అధికారులంటున్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది చెందక తప్పడం లేదు. దీని దృష్ట్యా సక్రమంగా సర్వర్ పని చేసేలా అధికారులు చర్యలు తీసుకొని తమ కష్టాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇతర పనులు కావడం లేదు

బియ్యం కార్డులకు దరఖాస్తుల స్వీకరణ, నమోదుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనివల్ల ఇతర పనులు కోసం వెళ్తే, వాటిని నిర్వహించడానికి జాప్యం చేస్తున్నారు. వన్ బీ పత్రం కోసం వెళ్తే ఇవ్వకుండా తిప్పి పంపారు. దీనివల్ల తీవ్ర ఇబ్బంది చెందుతున్నాం. సకాలంలో ఇవ్వకపోవడం వల్ల తమ కార్యకలాపాలకు అవరోధం కలుగుతోంది. ఇబ్బందుల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కంచిపాటి రాజు, రైతు, కశింకోట

సర్వర్ పని చేయలేదు

సర్వర్ సరిగ్గా పని చేయకపోవడంతో డేటా నమోదుకు జాప్యం జరుగుతోంది. సాధ్యమైనంత వరకు డేటా నమోదు చేసి ప్రజలు ఇబ్బంది చెందకుండా చర్యలు తీసుకుంటున్నాం. రేషన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభ దశలో ఉంది. పదుల్లో నమోదు అయ్యాయి. మరో పక్క ఇతర పనులు నిర్వహించాల్సి రావడం వల్ల కాస్త జాప్యం జరుగుతోంది.

– స్వరాజ్, డిజిటల్ అసిస్టెంట్, కశింకోట సచివాలయం

బుద్ధుని జీవిత చరిత్ర స్ఫూర్తిదాయకం



విజేతలకు బహుమతులు అందజేసిన కొణతాల జగన్

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి బుద్ధుని జీవిత చరిత్రపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్ తెలిపారు. ఆదివారం స్థానిక చిన్నరాజుపేటలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గౌతమ బుద్ధుడు జయంతిని పురస్కరించుకుని బుద్ధుని జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, అహింస, ధర్మం, సత్యం మార్గాల్లో పయనించి మంచి జీవనం సాగించాలని బోధించిన మొట్టమొదటి ప్రపంచ శాంతి ప్రదాత బుద్ధుడని అన్నారు. అంతకుముందు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం, కార్యదర్శి వినకోట నీలేష్ గుప్తా, ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, సహాయకార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వార్డు కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న టీడీపీ కార్యకర్తలు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని 84వ వార్డు కమిటీ ఎన్నిక కార్యకర్తల మనోభావాలకు, పార్టీ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిందని ఆ వార్డు టీడీపీ సీనియర్ కార్యకర్తలు ఆరోపించారు. 84వ వార్డులో పార్టీ సీనియర్ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్త కుప్పిలి జగన్ మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా టీడీపీకి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలుగా అనేక సేవలందించిన తమను ఇక్కడి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద అణగ దొక్కుతున్నారని ఆరోపించారు. ఒకరిద్దరి కార్యకర్తలను పిలిచి కమిటీని వేయడం సరికాదన్నారు. మరలా వార్డు కార్యకర్తలందరి సమక్షంలో కమిటీని వేయాలన్నారు. సమావేశంలో సీనియర్ కార్యకర్తలు బోడి వెంకటరావు, యర్రా సత్యనారాయణ, శ్రీకాకుళం వెంకట్రావు, రేబాక లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు



మేహాద్రి సమీపంలో మద్యం సేవిస్తున్న వ్యక్తులను డ్రోన్ ద్వారా గుర్తించి, కేసులు రాస్తున్న పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పలువురిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో మేహాద్రిగెడ్డ, నాయుడుతోట, వేపగుంట ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ చిత్రాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ప్రమాదకరంగా ఈత కొడుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి, అక్కడి నుంచి పంపేశారు. ఈ క్రమంలో మద్యం సేవిస్తూ దొరికిన 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దేముడునాయుడు

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సబ్ ఇన్‌స్పెక్టర్ దేముడునాయుడు అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మీ చెడు ప్రవర్తన కారణంగా మీ కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయని, ఆ నరకం ఆ కుటుంబ సభ్యులనే అడిగి తెలుసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీన్నసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

కాలీఫ్లవర్ సాగు..ఆదాయం బాగు



ములగపూడిలో సాగు చేస్తున్న కాలిఫ్లవర్ తోట



తోటలో ఏపుగా పెరిగిన కాలిఫ్లవర్ పువ్వు

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందుతున్న రైతులు
- ఒకప్పుడు ఏజెన్సీకే పరిమితమైన కాలిఫ్లవర్ సాగు
- నేడు మైదానంలో విస్తారంగా పంట

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసే కాలిఫ్లవర్ పంట ఇప్పుడు మైదానం ప్రాంతాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే ప్రస్తుతం కాలిఫ్లవర్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. మండలంలో ములగపూడి, బెన్నవరం మాధవనగం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల సాయంతో సాగు చేస్తున్నారు. మండలానికి సరిహద్దు గ్రామాలైన నర్సీపట్నం మండలం శివారు ప్రాంతమైన మెట్టపాలెం, కసిరెడ్డిపాలెం, అప్పన్నపాలెం గ్రామాల్లో కాయగూరలతో పాటు కాలిఫ్లవర్ పంటలు సాగు చేస్తున్నారు. రెండేళ్లుగా ఇక్కడ రైతులు కాలిఫ్లవర్ పంట సాగు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ బోర్ల ఏర్పాటు చేయడం, 9 గంటల పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేయడంతో కాలిఫ్లవర్ తోటలు సాగుకు అన్ని విధాలుగా బాగుంటుంది. ఒక ఎకరంలో వేసిన కాలిఫ్లవర్ పంట ద్వారా మార్కెట్లో రేట్లు గిరాకీని బట్టి ఏడాదికి లక్ష రూపాయలు వస్తుందని రైతులు చెబుతున్నారు. పెట్టుబడి కష్టపడే రైతులకు అయితే కేవలం రూ.20వేలు ఖర్చు అవుతుందని లేకుంటే అదనంగా మరో రూ.10వేలు ఖర్చు అవుతుందన్నారు. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే పెట్టుబడి తక్కువ అధిక ఆదాయం వస్తుందంటున్నారు. దీంతో ఈ ఏడాది ఆయా గ్రామాల్లో పలువురు రైతులు క్యాలిఫ్లవర్ సాగుపై దృష్టి సారించారు.

మా భూములు తిరిగి ఇచ్చేంత వరకూ న్యాయ పోరాటం

కె.కోటపాడు : కింతాడ రెవెన్యూ పరిధిలో తమ సాగు భూములు గ్రామానికి చెందిన వేరే వ్యక్తి పేరున ఏ విధంగా నమోదయ్యాయో రెవెన్యూ అధికారులు లోతైన విచారణ జరిపి తిరిగి తమ పేరున ఆ భూములను నమోదు చేయాలని జోగన్నపాలెం గ్రామానికి చెందిన కుభిరెడ్డి సన్నిబాబు, కిలపర్తి అప్పలనాయుడు, బండారు గంగా శ్రీనివాస్ తెలిపారు. జోగన్నపాలెంలో ఆదివారం వీరు మాట్లాడుతూ తాత ముత్తాతల కాలం నాటి నుండి తమ సాగులో ఉన్న భూములను గ్రామానికి చెందిన బి.నరసింహనాయుడుతో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేర్లపైనా రెవెన్యూ రికార్డుల్లో నమోదు అయి ఉందన్నారు. దీంతో తమ భూములను సదరు వ్యక్తి నుండి తిరిగి తమ పేరున నమోదు చేసేలా చర్యలను తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి, కలెక్టర్‌ను కలిసి విన్నవించినట్టు వీరు తెలిపారు. వీరికి ఈ సమస్యను పరిష్కరించాలని సదరు వ్యక్తులు ఆదేశాలను జారీ చేసిన పరిష్కరించడంలో తాత్సారం చేస్తున్నట్టు వీరు వాపోయారు. తమ భూములు తమ పేరున నమోదు అయినంత వరకూ పోరాటం చేస్తామని సన్నిబాబు, అప్పలనాయుడు, గంగా శ్రీనివాస్ తెలిపారు.

పునర్వినియోగ పదార్థాలను ప్రోత్సహించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేసిన నాగశ్రీను

అనకాపల్లి: పునర్వినియోగ పదార్థాలను అందరూ ప్రోత్సహించాలని నూకాంబిక దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయం ఆవరణలో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ అంశాలపై ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, షీల్డ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని భూమిలోపల నిల్వ చేసే విధానాలను అభివృద్ధి చేయాలన్నారు. కళాత్మకత, భావోద్వేగంతో, ప్రకృతిని రక్షించాలనే సంకల్పంతో చిత్ర లేఖనం పోటీలు నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ సమాజానికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థులో సృజనాత్మకత, కళాప్రతిభలను ప్రదర్శించడానికి చిత్ర లేఖనం పోటీలు దోహదపడతాయన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడడం ప్రకృతి సమతుల్యతకు అవసరమన్నారు. చిత్ర లేఖనం పోటీల్లో కిడ్స్ విభాగంలో కె.రోహిత్ కుమార్, డి.మోక్షిత, ఆర్నవి, జూనియర్స్ విభాగంలో వై.హేమలత, పి.మనస్వి, సి.హైందవి, సీనియర్స్ విభాగంలో డి.హేమంత్ సాయి, వి.జాహ్నవి, కె.నివాస్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, భోగలింగస్వామి దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, అండ్రూష్, నెకెట్టి సత్తిబాబు, బీరా వినోద్‌కుమార్, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.

దేవతమ్మ ఉత్సవానికి ఏర్పాట్లు



గవరపేటలో దేవతమ్మ



ఆసక్తిగా చూస్తున్న ప్రజలు

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన దేవతమ్మ ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం సిద్దుల వేషం, పంచరంగులు, పంచ చక్రాకారంలో అందంగా ముగ్గు పెట్టడం, దాన్ని 'వేగి' ఇంటి పేరు కలిగిన కుటుంబీకులు సంప్రదాయంగా తొక్కడం, అనంతరం దేవతమ్మను శారదానదిలో నిమజ్జనోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం సంప్రదాయంగా భక్తులు తెచ్చిన చీరల అమ్మకం నిర్వహిస్తామన్నారు. విశాఖపట్నం, గాజువాక, కూర్మన్నపాలెం, అనకాపల్లి, నర్సీపట్నం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వేగి కుటుంబీకులు వచ్చి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటారన్నారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మేకపోతును నిద్రించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జముకుల వారి వాయిద్యాలతో అమ్మవారి పాట గానం చేస్తూ పూజలు చేసి మేకపోతును నిద్రించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు సన్నాహాలు



అభయాంజనేయస్వామి విగ్రహానికి రంగులు వేస్తున్న శిల్ప కళాకారులు

కశింకోట: మండలంలో ఈ నెల 22న హనుమజ్జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహంతోపాటు ఆలయానికి అశోక ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక పరిషత్ ఆధ్వర్యంలో అందంగా రంగులు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక జాతీయ రహదారి వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. జయంతి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తమలపాకు, సిందూర అర్చనలు వగైరా కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పూసర్లవీధిలోని ఆంజనేయస్వామి, కుమ్మర వీధిలోని పంచముఖి ఆంజనేయస్వామి, సలాది వీధి, హౌసింగ్ కాలనీల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కంటి శస్త్రచికిత్సలకు 40 మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దివ్య



కంటి ఆపరేషన్లకు ఎంపికైన రోగులు

కశింకోట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణ మండపంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. 122 మంది రోగులకు నేత్ర పరీక్షలు చేయగా, వీరిలో 40 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. ఫౌండేషన్ వైద్యురాలు పి. దివ్య శిబిరంలో రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. జనసేన మండలాధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న, ఫౌండేషన్ మేనేజర్ ఎం. అరుణకుమార్, ఏఎన్ఎం కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిని కుమారుడి చెంతకు చేర్చిన పోలీసులు



మర్రి బందోను కుమారుడికి అప్పగిస్తున్న పీసీ చంద్రశేఖర్

పెందుర్తి: ఇంటి నుంచి బయటకు వచ్చి తప్పిపోయిన ఓ మహిళను పెందుర్తి పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాదాపు మూడు నెలల పాటు అనాథగా ఓ ఆశ్రమంలో ఆశ్రయం పొందిన ఆమె.. ఎట్టకేలకు పోలీసుల చొరవతో తన కుటుంబాన్ని చేరగలిగింది. వివరాలివి.. అల్లూరిసీతారామరాజు జిల్లా అరకు ప్రాంతానికి చెందిన మర్రి బందో(45) ఫిబ్రవరి 18న పని నిమిత్తం ఇంటి నుంచి నగరానికి వచ్చింది. ఆమెకు మానసిక సమస్య ఉండడంతో తిరిగి ఎలా వెళ్లాలో తెలియక, పెందుర్తి సమీపంలోని గొల్లవిల్లివానిపాలెం పరిసరాల్లో దిక్కుతోచని స్థితిలో తిరిగింది. ఈ క్రమంలో స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు బ్లూకోట్స్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. అయితే ఆమె తన వివరాలు సరిగా చెప్పలేకపోవడంతో అనాథగా భావించి పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు.

మూడు నెలల తరువాత..

అయితే పోలీసులు తమ ప్రయత్నం విరమించకుండా బందో స్వగ్రామం, కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ప్రయత్నం చేశారు. ఆమె ఫొటోను ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపారు. ఈ క్రమంలో ఆమెది అరకు ప్రాంతంగా గుర్తించి అక్కడికి చేరుకున్న పోలీసులు ఆమె ఇంటిని కనుగొన్నారు. బందో కుమారుడు మర్రి కామేశ్వరరావును ఆదివారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు రప్పించి ఆమెను అప్పగించడంతో ఆ తల్లి కథ సుఖాంతమైంది.